చలి చీమలు

శ్రీ కొచ్చర్లకోట వెంకట సుబ్బారావు

కర్మాగారంలో ఓ యంత్రం తయారయితే అది ఏదో ఒక పని మాత్రమే చేయగలుగుతుంది. కానీ ఆడది అనే యంత్రం అలా కాదు. అన్ని పనులు చేయగలుగుతుంది. చెయ్యాలి కాబట్టి. చేయలేనినాడు ఆ యంత్రాన్ని కన్‌డెం చేసి మరో యంత్రం తెస్తాడు మగాడు. 'కార్యేషు దాసి, కరణేషు మంత్రి' — అని చెబుతూనే ఆడది చెయ్యాల్సిన అష్టావధానాన్ని గురించి చక్కగానే నిర్దేశించారు.

ఆరడీలు

డబాయింపులు

దిగమింగే

యంత్రం ఈ సృష్టిలో ఒక్క ఆడదే. ఈ యంత్రం వనితనాన్ని బట్టి ఎన్ని అందమైన పేర్లు సృష్టించారు మగ రచయితలు.

"కామిని"

కుత్సిత మనోభావాలకు ప్రతీకగా మగవాడు ఆమెకు పెట్టిన మరో ముద్దు పేరు.

అర్ధాంగే కాదు వెలయాలు కూడా ఎప్పుడూ తన కామాన్ని గురించి చెప్పుకోదే! అలాంటప్పుడు ఆమెను, 'కామిని' అని ఎలా అనగలిగాడు.

ఆమె అధరాలు మధుపాత్రలని, ఆమె కళ్లు కైపెక్కించే మధువని, ఆమె క్రీగంటి చూపులు మన్మథ బాణాలని ఆమె పరిష్వంగం తూగుటుయ్యాలని వర్ణిస్తూనే తన ఆటవిడుపుకు ఆలంబనగా ఉపయోగించుకుంటూ వచ్చాడు. తనకు ఆపాదించిన ఉపమానాలకు తమ ఎక్కడ తులతూగలేకపోతానో అని క్షణం క్షణం కృంగిపోతూనే పురుషుణ్ణి సంతోష పెట్టేందుకు సదా సర్వదా ఆమె ప్రయత్నం చేస్తూనే ఉంది.

"సవితా!" అంటూ అర్ధాంగిపై చెయ్యి వేశాడు కేశవరావు.

కాలసర్పం బుస గొట్టినంత భయపడింది సవిత. అయినా భయం బయట పడనీయలేదు.

"సవితా! ఎంతసేపు చెప్పాలి" అంటూ మరి కాస్త దగ్గరకు జరిగాడు.

అయినా ఆమెలో చలనం లేదు. బటన్ నొక్కగానే ఆడే యంత్రంగానే ఇంతకాలం ఆమె ఉపయోగపడుతూనే వచ్చింది. కానీ ఈ మధ్య ఆమెలో ఆ శక్తి నశించిపోయింది. తనకు ఓ మనసు ఉందనీ అది ఎదురు తిరుగుతుందని గ్రహించగలిగింది. అందుకే ఆమె ఉలకలేదు, పలకలేదు. ఆమె ఆలోచన్లు తెగలేదు.

మృష్టాన్న భోజ్య పదార్థాలు చేసేందుకు ఓ వంటమనిషి
సపర్య చేసేందుకు ఓ దాసి
'ఆకలి' తీర్చేందుకు ఓ రంభ
మగవాడికి కావాలి.

'ఆల్ ఇన్ వన్'గా పనిచేస్తున్న ఒకే ఒక యంత్రం ఆడదిగా గుర్తించాడు మగాడు. ఆమెను అలాగే మలచాడు.

పలుపుతాడు కట్టించుకున్న పశువైన ఎప్పుడో ఒకప్పుడు తల విదిలిస్తుంది. పసుపుతాడు కట్టించుకున్న ఆడది అలా కూడా చెయ్యటానికి వీల్లేదు. తాళి కట్టించుకున్న పాపానికి ఈ దేశంలో ఎంతమంది అర్ధాంగులు ప్రతి రాత్రీ 'రేప్' చేయబడుతున్నారో ఈ చరిత్ర పుటలలోకి ఎక్కలేదు. తనకు ఇష్టం లేకుండా జరిగే ఏ కృత్యమైన అకృత్యమే. 'రేప్' గానే భావిస్తుంది ఆడది. అందుకే సవిత ఈ రోజు ఎదురు తిరగాలని నిశ్చయించుకుంది.

కేశవరావు వంటికాలుపై లేచాడు. ఆమె వినయంగానే ప్రక్కకు తొలిగింది.

'పగలు చేసిన పాపం రాత్రితో సరి' అంటూ ఆమెను మరికాస్త సమీపించాడు. సవితకు ఆ ద్వంద్వార్థం కంపరం కలిగించింది. ఆమె నిలదీసి అడగాలని నిశ్చయించుకుంది.

"జరిగినదానికి మీరు క్షమాపణ చెప్పాలి. అప్పుడే మీరు ఆశించింది పొందగలుగుతారు." ఖండితంగా చెప్పింది.

'క్షమార్పణ' మాట వినగానే కేశవరావ్ బాంబు పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు. భర్త భార్యకు 'క్షమార్పణ' చెప్పటమా! ఇంత

వరకు ఏ భర్తా ఏ భార్యకూ అలా చెప్పిన దాఖలాలు లేవే! ఇంత అసందర్భంగా మాట్లాడుతుందేమిటి? అనుకున్నాడు.

"భార్యా భర్తల మధ్య క్షమార్పణ ఏమిటి?" గంభీరంగా అన్నాడు.

"ఏం భార్యాభర్తలయితే మాత్రం మనుషులు కారా! తప్పు చేసినవాడు క్షమార్పణ చెప్పటంలో న్యూనతా భావం ఎందుకు?

సవిత అన్న మాటల్లో యదార్థం ఉందని కేశవరావుకు తెలుసు. తను జీవితంలో చాలాసార్లు 'సారీ' చెప్పాడు.

"కేశవరావుగారూ!" మిమ్మల్ని అయ్యగారు రమ్మంటున్నారు. అటెండర్ చెప్పాడు.

అటెండర్ మొహం చూడగానే కేశవరావుకు యమభటుడు గుర్తుకు వచ్చాడు. అసలే ఆఫీసర్ చండశాసనుడు. తుమ్మల్లో ప్రొద్దు క్రుంగిన మొహం వాడూనూ అనుకుంటూ చూస్తున్న ఫైలు ప్రక్కన పెట్టి గబగబా ఆఫీసరు గదిలోకి వెళ్ళాడు. వినయంగా చేతులు కట్టుకుని నిలబడ్డాడు. ఆఫీసరు తల వంచుకుని ఏదో ఫైలు చూస్తున్నాడు. కన్నెత్తి కేశవరావువైపు చూడలేదు. కొంచెంసేపు వెయిట్ చేసి కేశవరావ్ సన్నగా దగ్గాడు. అలాన్నా తనవైపు చూస్తాడని అతని ఆశ.

"ఏమోయ్ కేశవరావ్! ఎంతసేపు అయింది వచ్చి?" ఉపోద్ఘాతంగా అన్నాడు.

"పదిలోపే వచ్చాన్ సార్! వినయంగా సమాధానం చెప్పాడు.

"ఆఫీసుకు ఎప్పుడు వచ్చావని కాదు నేను అడుగుతా! ఈ గదిలోకి ఎప్పుడు వచ్చావు అని?"

"చాలాసేపు అయింది సార్!"

"అయితే ఎందుకు చెప్పలేదు? ఓహో నేను ఏ ఫైలు చూస్తున్నానని....?" గుంభనగా అన్నాడు.

"లేదు సార్! జస్ట్ అలా నిలబడ్డాను మీరు చూస్తారు కదాని".

"నేను కాన్ఫిడెన్షియల్ ఫైలు చూస్తున్నానని తెలియదా? తెలిసే రహస్యాలు తెలుసుకుందామని తొంగి చూస్తున్నావా?"

"నో సార్! నో! నాకు అలాంటి ఉద్దేశ్యం లేదు సార్!"

"నాకు తెలుసు. నా మొగుడు నన్ను గూటిస్తూ మెమో ఇస్తే ఎలా చివాట్లు పెట్టాడా చూద్దాం అని నువ్వు దొంగ చూపులు చూస్తున్నావు."

"కాదు సార్! మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యటం యిష్టం లేక మెదలకుండా నిలబడిపోయాన్ సార్!"

"ఆల్‌రైట్! నువ్వు చూసినా చూడకపోయినా ఈ రిపోర్టు నువ్వు చూడాల్సిందే! ఇదేమిటో తెలుసా?"

"నో సార్! తెలియదు!"

"తెలుసుకోవాలోయ్. ముఖ్యంగా నువ్వు తెలుసుకోవాలి. నా మొగుడు అంటే మన యం.డి. నాకు అక్షింతలు వేస్తూ రాసిన లవ్ లెటర్ అంటే ముద్దు ముద్దుగా ముక్కు చివాట్లు పెడుతూ యిచ్చిన మెమో!" అంటూ ఆఫీసర్ పీతాంబరం వెర్రి మొహం పెట్టాడు.

యం.డి. గారు ఆఫీసర్‌ని తిడితే అందుకు తనెందుకు బాధ్యుడో కేశవరావుకు అర్థం కాలేదు. అయినా పైకి ఎలా అనగలడు?

"నువ్వు చేసిన నిర్వాకం అంతా ఇలానే ఉంటుంది కేశవరావ్! అర్జంట్ ఫైల్ త్వరగా పుటప్ చెయ్యాలి అని నీకు చెప్పానా? అది ఇంతవరకు అఘోరించలేదు. అది ఎందుకు పంపలేదు అంటూ ఆయనగారు కోతి రాతలు రాసి నన్ను నంజుకు తింటూ శ్రీముఖం పంపాడు."

"నేను మీరు చెప్పగానే ఫైల్ పుటప్ చేశాను సార్!" వంగి వంగి వినయంగా సమాధానం చెప్పాడు.

"మరైతే ఏమయినట్టు ఆ ఫైల్ పైకి ఎందుకు పంపలేదు?"

"సంతకానికని మీ టేబుల్ మీద పెట్టాను సార్. 15 రోజులయింది. మీరు బిజీగా ఉండి సైన్ చెయ్యలేదనుకుంటా?"

"అవును బిజీగానే ఉన్నాను. సంతకం పెట్టలేదు. ఫైల్ టేబుల్ మీద పెట్టగానే సరిపోయిందనుకుంటున్నావా? ఈ కీకారణ్యంలో ఆ ఫైల్ ఎక్కడ పడి ఉందో! చూడు ఈ టేబుల్ నిండా ఫైల్సే? ఎన్నని చూడను." అంటూ టేబుల్‌పై ఉన్న ఫైళ్ళని చిందరవందర చేశాడు. ఆయన చెయ్యి విసురుగా తగలటం వల్ల ఒకటి రెండు ఫైల్స్ క్రింద పడ్డాయి. వాటిని తీసి కేశవరావ్ మళ్ళీ టేబుల్ మీద పెట్టాడు.

"ఏం మాట్లాడవేం? ఏమిటి నీ ఎక్స్‌ప్లనేషన్. ఫైల్ మీద సంతకం అయిందో లేదో చూడాల్సిన బాధ్యత నీకు ఉందంటావా? లేదా?"

"ఉంది సార్!"

"మరైతే ఎందుకు నా సంతకం తీసుకోలేదు? ఎందుకు డిస్పాచ్ చేయించలేదు. ఇప్పుడు నీకు మెమో యిస్తాను. నీ సమాధానం సంతృప్తికరంగా లేకపోతే నిన్ను సస్పెండ్ చేస్తాను. ఆ తర్వాత పైకి రాస్తాను. ఆ తర్వాత ఎంక్వయిరీ జరుగుతుంది. ఆ పైన నీ ఉద్యోగం ఊడుతుంది. లేదా శంకరగిరి మాన్యాలుకు పంపుతాను. అప్పుడు కళ్లు తెరుస్తావు? అవునా?

"లేదు సార్! సారీ సార్! తప్పయిపోయింది. ఇంత జరుగుతుందని నేను అనుకోలేదు. ఏదో పనుల వత్తిడిలో నెగ్‌లెట్ చేశాను. ఇకముందు అలా జరగదు సార్! ఈసారికి క్షమించండి సార్! ఐయాం వెరీ వెరీ సారీ!" అంటూ ప్రాధేయ పడుతూంటే కళ్ళనీళ్ళ పర్యంతం అయింది కేశవరావుకు.

"సరే! నువ్వు ఇంత కాలం ఎంతో సిన్సియర్‌గా పని చేశావు కాబట్టి ఈసారికి ఇలా వదిలేస్తున్నాను. ఇకముందు కాస్త జాగ్రత్తగా వర్క్ ఎటెండ్ అవుతూండు. లేకపోతే చిక్కుల్లో పడతావ్." అంటూ హెచ్చరించాడు.

కేశవరావు దిగులుగా వచ్చి సీటులో కూర్చున్నాడు. ఆ రోజంతా ఏమీ పని చెయ్యబుద్ధి పుట్టలేదు.

ఎంతసేపు ఆలోచించినా తన తప్పు ఏమిటో అర్థం కాలేదు. ఆఫీసర్ చెప్పిన పని వెంటనే చేశాడు. ఫైల్ టేబుల్ మీద కూడా పెట్టాడు. ఆయన సంతకం చేయకపోతే తన తప్పు అంటాడేమిటి ఆ భ్రష్టుడు? చెయ్యని తప్పుకు తను బాధ్యత వహిస్తూ క్షమించమని అడిగాడు. అప్పుడు గానీ ఆఫీసర్ ముండా వాడు వదల్లేదు.

ఈ ప్రపంచంలో ఎంత దోపిడి జరుగుతోంది!

ఇలా అనుకుంటున్న కేశవరావ్‌కు తెలియని విషయం ఒకటుంది. అది ఏమిటంటే తనూ ఈ దోపిడి వ్యవస్థలో భాగస్వాముడుగా ఉన్నాడన్న నిజం తెలియదు. తనూ యిలా ఎంతమందిని చెయ్యని నేరానికి శిక్షిస్తున్నాడో కేశవరావ్‌కు తెలియదు. ఆ విషయం అతని భార్య సవితకు బాగా తెలుసు.

తను సుఖంగా గడిపిన రోజులు ఎన్ని? అని సవిత ప్రశ్నించుకున్నప్పుడల్లా ఎప్పుడూ సమాధానం దొరికేది కాదు. ముఖ్యంగా పెళ్ళయిన తర్వాత ఒక్కరోజు కూడా సుఖపడ్డానని ఆమె అనుకోలేదు.

పెళ్ళి చేసుకొన్న మగవాడు పెళ్ళి చేసుకోని ఆడది సుఖపడతారు. మగవాని సుఖాలకు ఎక్కడ లోటు వస్తుందో అని ఈ వ్యవస్థలో ఆడదానికి పెళ్ళి అవసరం అని నొక్కి చెప్పారని సవిత నిశ్చితమైన అభిప్రాయం.

ఝాము పొద్దు ఉండగా లేచి కాఫీ కలిపి ఫ్లాస్కులో పొయ్యడంతో మొదలవుతుంది దినచర్య.

పిల్లలిద్దరిని బెడ్ మీంచి లేపేందుకు సగం అలిసిపోతుంది.

"మమ్మీ! రాత్రంతా ఏవో పిచ్చి పిచ్చి కలలు. ఇప్పుడే కాస్త నిద్ర పట్టింది. కాసేపు పడుకుంటాను మమ్మీ!" అంటూ మారాం చేస్తాడు పెద్దవాడు రవి.

"మమ్మీ! రాత్రి నేను ఒక గంటసేపు ఎక్కువ చదువుకున్నానుగా. మరో గంట పడుకుంటేగానీ నిద్ర చాలదు" అంటాడు చిన్నవాడు వాసు.

పాపం పిల్లలు అలసిపోయారు అనుకుని 'అలానే' అంటూ మళ్ళీ పనిలో పడుతుంది.

పనిమనిషి ఒకరోజు వస్తే మర్నాడు నాగా పెడుతుంది. అదేమిటని గట్టిగా అంటే "మీరిచ్చే ముష్టి అరవై రూపాయలకు నేను కాబట్టి ఉదయం సాయంత్రం రెండేడు అంట్లు తోముతున్నాను. ఇదే కూలికి పోతే మూడు రోజుల్లో సంపాయిస్తాను." అంటూ బెదిరిస్తుంది. పనిమనిషి నిజంగానే అన్నంత పని చేస్తుందేమో నన్న భయంతో వేడి వేడి కాఫీ ఫ్లాస్కులోంచి గ్లాసులోకి వంపి నింపాదిగా అంటుంది. "రత్తాలూ! ఇప్పుడు నేనేమన్నానని? ఏదో ఆఫీసు వున్న రోజుల్లో వస్తే చాలు. శలవు రోజు ఎలానూ నేనే తోముకుంటాను." అంటూ నచ్చచెబుతుంది. ఫిల్టర్ కాఫీ గొంతులో పడేటప్పటికి రత్తాలు గొంతు మార్దవంగా మారుతుంది. హమ్మయ్య ఇక ఫర్వాలేదు. పని మానదు అనుకుంటూ సవిత రవి, వాసులను నిద్ర లేపేందుకు మళ్ళీ పక్కల దగ్గరకు వెళుతుంది. అతి కష్టం మీద రెక్క పుచ్చుకొని లేపితే గానీ వాళ్లు మంచం దిగరు.

వాళ్ళకు బ్రష్‌ల మీద పేస్ట్ వేయటం దగ్గర్నుంచి తనే అన్నీ చెయ్యాలి. అలా చెయ్యకపోతే వాళ్లు తాత్సారం చేస్తారు. టైం వృధా అయిపోతుంది. చదువుకు కూర్చోరు. హోంవర్కు చెయ్యరు. స్కూల్లో మాస్టారు పేరెంట్స్‌ని పిలిచి చీవాట్లు పెడతారు. "ఏమంటే! భార్యాభర్త లిద్దరూ చదువుకున్నారు కదాని పిల్లలకు సీటు యిస్తే ఇలా చదువు అలక్ష్యం చేస్తే స్కూలు పరువు ఏంగాను" అంటూ ప్రిన్సిపాల్ మెత్త మెత్తగా చివాట్లు పెడతాడు.

ప్రస్తుతం మంచి కాన్వెంట్లన్నీ పిల్లల యోగ్యతను కాకుండా తల్లిదండ్రుల డిగ్రీలు చూసి సీట్లు యిస్తున్నాయి. చదువుకున్న తల్లిదండ్రులయితే యింటి దగ్గర పిల్లల చదువు పట్టించుకుంటారు. అలా ఆలోచించటం వాళ్ళ తప్పు కాకపోయినా ఇన్ని బాధ్యతలు ఓ ఆడది వహించటం ఎంత కష్టం?

స్త్రీకి విద్య ఎంతో అవసరం అని బల్లగుద్ది వాదించిన సవిత తన వాదనలో వున్న లొసుగు అనుభవంలో అర్థం చేసుకుంది.

చదువుకున్న ఆడది తన ఉరితాడు తానే ఎంపిక చేసుకుంది. ఏ చదువు రాకపోతే ఎంత హాయిగా ఉండగలిగేదో!

చదువుకున్న స్త్రీ యింట్లో పిల్లలకు పాఠాలు చెప్పాలి.... బయట ఉద్యోగం చెయ్యాలి. ఇంత చేస్తున్నా స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చిందా అంటే అదీ లేదు. తన సంపాదనపై తనకు ఎంతమాత్రం హక్కు లేదు. అన్నీ భర్త యిష్టప్రకారమే జరగాలి. అందుకు భిన్నంగా జరిగితే ఎవరి సంపాదన వారిదైనప్పుడు ఈ సంసారం ఎందుకు? ఎవరిష్ట మొచ్చినట్లు వాళ్ళు ఉందామంటూ విడాకులు దాకా విషయం సాగదీస్తాడు భర్త. భర్త వదిలేసిన ఆడది ఉద్యోగం చేస్తూ పరువుగా బ్రతగ్గలదా? తన బ్రతుకు అడ్రసు లేని ఉత్తరం అయిపోతుందేమో ననే భయంతో యింక స్వాతంత్ర్యం ప్రసక్తి తీసుకురాదు. తన చదువు తనకు ఎలా ఉపయోగపడింది? మరింత బానిసను చేసింది. మరింత దోపిడీకి దోహదం చేసింది.

పూర్వం స్త్రీ ఇల్లు నాలుగు గోడల మధ్య ఏ కష్టాలు అనుభవించేదో తెలియదు గానీ స్వేచ్ఛ అనే పేరుతో బయట ప్రపంచంలో పడ్డ ఆడది మరింత నవ్వులపాలు అవుతోందని సవిత నమ్మకం. స్వేచ్ఛ అనే పేరుతో బంధనాలు పెంచుకుంది. మరిన్ని బాధ్యతలను నెత్తిన వేసుకుంది. పూర్వమయితే యింటి పని చూసుకుంటే సరిపోయేది. మరి యిప్పుడో? ఇంటా బయటా చూసుకోవాలి. ఉద్యోగం చేస్తున్నది కదాని యింటి బాధ్యతలు ఏమైనా తప్పాయా అంటే అదీ లేదు.

ఆడది చదువుకోవాలి అన్నారు. చదువుకున్న ఆడది ఉద్యోగం చేస్తే వేన్నీళ్ళకు చన్నీళ్ళ తోడు అన్నారు. చదువుకున్న తల్లి పిల్లలకు నాలుగు అక్షరం ముక్కలు నేర్పకపోతే ఆ చదువు సార్థకత ఏమిటి అన్నారు. ఉద్యోగం చేస్తున్నంత మాత్రాన యింట్లో పని చేసుకోరా ఏమిటి అంటూ ఆ పనులన్నీ యధాతథంగా అంటగట్టారు. ఇన్ని బాధ్యతలు నెత్తిన వేసుకుని స్త్రీ అనుభవించే స్వేచ్ఛ ఏమిటో సవితకు అర్థం కాదు. స్త్రీ స్వేచ్ఛ పేరుతో జరుగుతున్న కార్యక్రమాలన్నీ జారుడుబండ ప్రగతి లాంటివే. ఆమెను ఊబిలోకి మరింత దిగజారుస్తున్నాయి. పూర్వం అనుభవిస్తున్న విరామం, విశ్రాంతి కూడా ఈనాటి ఆడదానికి లేకుండా పోయింది.

తన ఆలోచన్లు తనకే విచిత్ర మనిపిస్తాయి సవితకు. ఉద్యోగం స్టేటస్‌గా, చదువు సభ్యతగా పరిగణింపబడుతున్న ఈ రోజుల్లో తను వద్దంటుంది ఏమిటి?

అవును ఎందుకు వద్దనదు? పగలంతా చేయాల్సిన యింటి పని ఉదయమే చేసి ఆఫీసుకు వెళ్ళాలి. మళ్ళీ రాత్రి పని మామూలే. అలసి ఆఫీసు నుంచి రాగానే పిల్లలకు టిఫెన్ చెయ్యడం దగ్గర్నుంచి అన్ని పనులు నెత్తిన పడతాయి. కూలీ చేసే మనిషి 10 గం॥లు చేస్తుంటే ఉద్యోగం చేస్తున్న ఆడది 16 గం॥లు పని చేస్తోంది. ఇదేనా స్వేచ్ఛ? ఇంత చేసినా మగవాని జులుంకు లోనుకాక తప్పటం లేదు.

ఉదయం ఆఫీసుకు వెళుతూ నిన్న తెచ్చిన ఫైళ్ళు తిరిగి తీసుకు వెళ్ళటం మర్చిపోయాడు కేశవరావు. అవి ఆ రోజే డిస్పాచ్ కావాల్సి వుంది అవటంతో ఇరవై కి.మీ. స్కూటరు మీద ప్రయాణించి యింటికి వచ్చాడు.

"నిన్న ఆఫీసు ఫైల్స్ యింటికి తీసుకు రావడం చూశావుగా! ఉదయం ఒట్టి చేతులతో వెళుతుంటే ఫైల్స్ తీసుకు వెళ్ళటం మర్చిపోయారండి అని గుర్తు చేయక్కర్లేదా" అని సవిత మీద విరుచుకు పడ్డాడు.

"అదేమిటండీ! నేను యింటా బయటా సతమతమవుతుంటే ఇది కూడా నా బాధ్యతే అన్నట్టు మండిపడతారేమిటి?" అంటూ ఎదురు చెప్పింది. అతడు సహనం కోల్పోయాడు. దుర్భాషలాడాడు. జరిగినదానికి ఆమె సారీ చెప్పమంది. ఇది వారి వివాదానికి ఓ చిన్న కారణం.

"సవితా! చిన్న విషయాన్ని ఎందుకింత సీరియస్‌గా తీసుకుంటావు? మా ఆఫీసరు చెయ్యని నేరానికి నన్ను నిందించాడు. అయినా వాడు సారీ చెప్పలేదు. పైగా నేను చెప్పాల్సి వచ్చింది. ఇది మామూలే!" అంటూ నచ్చచెప్పబోయాడు కేశవరావు.

"అయితే భార్యాభర్తల సంబంధం కూడా అంతేనంటారా? యజమాని బానిస సంబంధమా? ఇద్దరిలో ఎవరి తప్పు వున్నా భార్యే క్షమాపణ చెప్పాలంటారా? అయినా మీలో తప్పు లేనప్పుడు యజమానికైనా మీరు సారీ చెప్పాల్సిన అవసరం లేదు. తప్పు చేసినప్పుడు మనకన్నా తక్కువ వాడికైనా సారీ చెప్పి తీరాలి. అలా చెయ్యకపోతే ఆ మనిషికి సంస్కారం లేనట్టే."

ఆఫీసరుకు సబార్డినేట్, భర్తకు భార్య తలవంచటం ఈ వ్యవస్థలో వున్నదే అని కేశవరావు వాదన. కానీ సవిత అందుకు ఒప్పుకోదు. అలా లొంగిపోవటం ఆత్మన్యూనతా భావం అంటుంది. ఆత్మాభిమానం చంపుకుని బ్రతకాల్సిన అవసరం లేదంటుంది. అక్కడ ఆఫీసరు ముందు ఆత్మాభిమానం చంపుకుని 'సారీ' చెప్పటం యిక్కడ తప్పు చేసి భార్యకు 'సారీ' చెప్పక పోవటం రెండూ కేశవరావు చేసిన తప్పులే. వ్యవస్థలో వుందని తలవంచటం కంటే వ్యవస్థను మార్చటానికి ప్రయత్నించాలి. అప్పుడే సరైన విధానంలో వ్యవస్థ తయారవుతుంది. ఇంత విడమరచి ఆలోచిస్తే గానీ కేశవరావుకు తన తప్పు అర్థం కాలేదు—